క్లుప్తంగా

ఇంటి పన్నులు వందశాతం వసూలు చేయాలి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 పంచాయతీల్లో ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని, ఆ బాధ్యత గ్రామ కార్యదర్శులపై ఉందని ఏఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండోరోజు శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఈఓపీఆర్‌డీ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా గంజి కుండల ఊరేగింపు



గంజి కుండల ఊరేగింపులో భక్తులు

సత్యవేడు: ఆడిమాసం చివరి రోజున ఆదిపరాశక్తి ఆలయంలో భక్తులు ఆడిపూరం గంజి కుండల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం మేళ్మరువత్తూరు ఆదిపరాశక్తి ఉత్సవ విగ్రహానికి విశేషాలంకరణ చేసి, ఎర్రదుస్తులు ధరించిన మహిళలు, పురుషులు ఆడిపూరం గంజి కుండలు తలపై ఉంచుకుని గాంధీరోడ్డు, నేతాజీ రోడ్డు, పల్లాపు వీధి, శివాలయం వీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. భక్తులు అమ్మవారికి హారతులు పట్టారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో షణ్ముగం రెడ్డి, ఎంఆర్ శోభ, రేవతి, శెల్వి తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీ సంఘం నూతన కమిటీ ఎన్నిక

శ్రీకాళహస్తి: సీఐటీయూ అనుబంధ సంఘాలైన శ్రీకాళహస్తి పట్టణ ఆర్పీల సంఘం నూతన కమిటీ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఈ ఎన్నికల పరిశీలకుడిగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరిపుల్లయ్య వ్యవహరించారు. పట్టణాధ్యక్షురాలిగా సరళాదేవి, కార్యదర్శిగా లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా అమ్ములు, సుభద్ర, సహాయకార్యదర్శులుగా హబీబా, లత, ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హిడింబాసుర వధ

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో చేనేత సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ప్రదర్శించిన హిడింబాసుర వధ వీధి నాటకం ప్రేక్షకులను అలరించింది. మంగళవారం ఉదయాన్నే స్వామిఅమ్మవార్ల విగ్రహాలకు అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మదనపల్లెకు చెందిన భాగవతారిణి శివకుమారి హరికథా గానం చేశారు. సోమవారం రాత్రి భీముడు, హిడింబాసురుడు వేషధారణలో కళాకారులు పాటలు, పద్యాలు ఆలపిస్తూ చేసుకున్న ముష్టి యుద్ధం ఆకట్టుకుంది.

అక్కపై తమ్ముడి దాడి

శ్రీకాళహస్తి: పెద్దమసీదు వీధిలో నివాసం ఉంటున్న సహీనా(26)పై హుస్సేన్(22) సోమవారం మద్యం మత్తులో దాడి చేశాడు. పోలీసుల కథనం మేరకు.. సహీనా తల్లిదండ్రులు చనిపోయిన తరువాత హుస్సేన్ తల్లిదండ్రులు ఆమెను పెంచిపెద్ద చేశారు. అయితే ఆమె వివాహానంతరం హుస్సేన్ తల్లిదండ్రులు చనిపోయారు. అయితే తమ అక్క సహేను త న తల్లిదండ్రులు బాగా చూసుకున్నారని ఆమె ఇప్పుడు తనను పట్టించుకోవడం లేదని గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం మద్యం మత్తులో హుస్సేన్ ఆమె వీపుపై కత్తితో గాయం చేశాడు. ఒకటో పట్టణ సీఐ గోపి దీనిపై కేసు నమోదు చేశారు.

పేదలకు అన్నదానం

శ్రీకాళహస్తి: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద బీజేపీ పట్టణాధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు తన తండ్రి గరికపాటి రామచంద్రయ్య వర్ధంతి సందర్భంగా మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ హాజరయ్యారు. రామచంద్రయ్య చిత్రపటం వద్ద నివాళలర్పించారు.

గురుసరానందాజీ శ్రీకాళహస్తికి ఎందుకొచ్చారు?

శ్రీకాళహస్తి: మధుర ఉదాసీన్ ట్రస్టీ ఆశ్రమ పీఠాధిపతి, శ్రీగురు సరానందాజీ మహారాజ్ శ్రీకాళహస్తి శుకబ్రహ్మాశ్రమంలో ప్రత్యక్షం కావడంపై అనేక అనుమానాలకు తావిస్తోంది. 350 ఎకరాల ఆశ్రమం, అనేక మంది శిష్యులు, పరిచారకులు, తలుచుకుంటే ముఖ్యమంత్రులు సైతం ఆయన సేవ కోసం వేచిఉంటారు. అలాంటి స్వామిజీకి మనశ్శాంతి ఎందుకు కరువైందో అర్థం కావడంలేదు. అక్కడి నుంచి తిరుపతికి చేరుకుని తన వేషధారణ తెలియకుండా ఉండేందుకు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు. సాధారణ సన్యాసిలా శ్రీకాళహస్తిలోని శుకబ్రహ్మాశ్రమానికి చేరుకుని అక్కడ ఆశ్రయాన్ని అభ్యర్థించాడు. ఈ విషయమై పోలీసు ఉన్నతాధికారులు హడావుడి చేసి మీడియాతో ఆయనను కదలనీయకుండా అడ్డుకున్నారు. కాగా ఆయన ప్రశాంతత కోసం శ్రీకాళహస్తికి వచ్చాడని, ఎవరితో మాట్లాడరని అక్కడున్నవారు చెప్పడం గమనార్హం. అనంతరం శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకుని చెన్నైకి బయలుదేరి వెళ్లారు. డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి, తిరుపతి స్పెషల్ బ్రాంచ్ సీఐ ఆధ్వర్యంలో ఆయనకు రక్షణ కల్పించారు. అయితే సర్వత్రా దీనిపై ఏం జరిగిందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

గూడు కల చెదురుతోంది!

సొంతిల్లు కట్టుకుని.. అందులో హాయిగా ఉండాలన్నది సగటు జీవి కల. ఆ స్వప్నం సాకారం చేసే దిశగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందరూ ఆనందించారు. అయితే ఎన్నికల కోడ్.. ప్రభుత్వ మార్పుతో బిల్లులు వస్తాయో లేదో.. సర్కారు ఏమి చేస్తుందో తెలియక ఇళ్ల నిర్మాణాలకు బ్రేక్ పడింది. ఫలితంగా సగటు జీవి గూడు కల చెదురుతోంది.

కుక్కంబాకం లే అవుట్‌లో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు



పక్కా గృహాల నిర్మాణాలకు బ్రేక్!

- మంజూరైన ఇళ్లు: 950
- పూర్తియినవి: 654
- స్లాబు స్థాయిలో ఆగినవి: 72
- వివిధ దశలలో ఉన్నవి: 203
- ప్రారంభం కానివి: 79
- ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై సందిగ్ధం
- కొత్త ప్రభుత్వం నిర్ణయంపై ఎదురు చూపులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని జగనన్న కాలనీల్లో కొత్త ప్రభుత్వ ఏర్పడిన తర్వాత పక్కాగృహాల నిర్మాణాలకు బ్రేక్ పడింది. మంజూరైన ఇళ్ల నిర్మించుకోవడంలో లబ్ధిదారులు నిరాసక్తత చూపుతున్నారు. ముఖ్యంగా ఎస్టీ, ఎస్టీలకు చెందిన పక్కా గృహాల నిర్మాణం ముందుకు కదలడం లేదు. గత ప్రభుత్వంలో మండలంలో మొత్తం 16 జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేయగా, ఇందులో 950 పక్కాగృహాలు మంజూరు చేశారు. హౌసింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో 654 పక్కాగృహాలు నిర్మాణాలు పూర్తయ్యాయి. గృహ ప్రవేశాలు జరిగాయి. మరో 72 ఇళ్లకు స్లాబులు పూర్తయ్యాయి. 203 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. 79 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. సరిగ్గా ఎన్నికల కోడ్ వచ్చిన క్రమంలో పక్కాగృహాల నిర్మాణాలు ఆగిపోయాయి.

ఎన్నికల తరువాత కొత్త ప్రభుత్వం రెండు నెలలు గడిచినా ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం పక్కాగృహాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న సందేహమే ఇందుకు కారణమని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. అధికారులు ఎంతగా నచ్చచెబుతున్నా లబ్ధిదారుల్లో కదలిక రావడం లేదు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు చెందిన 184 ఇళ పక్కాగృహాలు సందిగ్ధంలో ఉన్నాయి. ఇసుక, సిమెంట్, ఇనుము, తదితర మెటీరియల్ ధరలు పెరిగి పోతాయేమోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పక్కాగృహాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు ఇళ్ల నిర్మాణాలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

బిల్లులు ఆగిపోయాయి



ప్రభుత్వం ఎన్నికల కోడ్‌ను ప్రవేశ పెట్టడంతో బిల్లులు రాలేదు. దీంతో ఇంటి బేస్ మట్టం వేసి, బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. పేదలమైన మాకు ఇంటి నిర్మాణం భారంగా ఉంది. బిల్లు వస్తే ఇంటి నిర్మాణ పనిని చేయాలి. అప్పటి వరకు పనులు చేయలేను.

-సుబ్బమ్మ, కనమనంబేడు

బిల్లులు రావనే భయం



కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో బిల్లులు సక్రమంగా ఇవ్వరనే భయంతోనే ఇంటి నిర్మాణ పనులు చేయలేదు. కొత్త ప్రభుత్వం ఇళ్ల నిర్మాణంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న భయంతోనే ఇళ్లు నిర్మించుకోలేదు. కమ్మీ, సిమెంట్ ధరలు పెరుతాయని ఎప్పటికీ ఇల్లు కట్టుకోలేం. - వెంకటమ్మ, నీర్పాకోట గ్రామం

వారంగా బిల్లులు ఇస్తున్నాం



ఎన్నికల కోడ్ కారణంగా 7 నెలలుగా పక్కాగృహాలకు బిల్లులు ఆగిపోయాయి. గత వారం రోజులుగా పనులు జరిగే ఇళ్లకు సంబంధించి బిల్లులు చెల్లింపులు జరుగుతున్నాయి. మండలంలోని జగనన్న కాలనీల్లో ప్రారంభం కాని పక్కాగృహాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ,ల ఇళ్లపై దృష్టి సారించాం. - సుబ్రమణ్యం, ఏఈ, హౌసింగ్

ద్రౌపదమ్మకు పుట్టింటి సారె



పూజల్లో పాల్గొన్న చెన్నంపల్లె గ్రామస్తులు



పూజలు చేస్తున్న అర్చకులు

ఏర్పేడు : మండలంలోని పాపానాయుడుపేటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి పుట్టినిల్లు అయిన చెన్నంపల్లె గ్రామంలో ద్రౌపదమ్మకు స్థానికులు పెద్ద ఎత్తున సారె సమర్పించారు. ప్రతి ఇంటి నుంచి పసుపు, కుంకుమ, చీర, రవిక, మెట్టెలు తదితర సారె సామగ్రి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని పాపానాయుడుపేట వరకు మంగళమేళాలతో ఊరేగింపునకు సాగనంపారు. అక్కడ బుధవారం రాత్రి ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. చెన్నంపల్లె ద్రౌపదమ్మ యువత సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామస్తులు పోటెత్తారు.

ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధం



అగ్ని ప్రమాదం జరిగిన ఇల్లు

వరదయ్యపాళెం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమైన ఘటన వరదయ్యపాళెంలోని ట్రంక్ రోడ్డులో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. మండలకేంద్రంలోని ట్రంక్ రోడ్డులో గ్రామీణ బ్యాంకు ఎదురుగా ఖలీల్‌కు చెందిన మిద్దె ఇంట్లో మోపూరుపల్లె వాసి శాంతి అద్దెకు ఉన్నారు. భర్తను కోల్పోయిన ఆమె వరదయ్యపాళెంలో ఓ చిరు హోటల్‌ను నడుపుకుంటూ జీవనం సాగిస్తోంది. మంగళవారం ఆమె హోటల్ వద్ద ఉండగా ఇంట్లో ఒక్కసారిగా పొగలు బయటకు వచ్చాయి. దీంతో సమీపంలోని వారు ఆమెకు సమాచారం ఇచ్చారు. ఆమె హుటాహుటిన ఇంటికి చేరుకుని తలుపు తెరవగా ఇల్లు మొత్తం పొగ చుట్టుకుపోయి ఉంది. ఇంట్లోని టీవీ, మరికొన్ని ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. టీవీ సమీపంలోని స్విచ్ బోర్డులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు ఆమె తెలిపింది. దీనిపై విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసింది.

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి

నారాయణవనం: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పోటీతత్వం పెంచుకోవాలని పలువురు పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణవనం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈఓ షణ్ముగం మాట్లాడుతూ పోటీల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో ఆరోగ్యకర పోటీతత్వాన్ని అలవరచుకోవడంతో విషయ పరిజ్ఞానం పెంచుకోవడంతోపాటు పోటీ పరీక్షలపై శ్రద్ధ పెరుగుతుందన్నారు. విజేతలకు గురువారం స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు. పోటీలను హెచ్ఎంలు సుకోచనమ్మ, శశికళ, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి సాదర స్వాగతం



డిప్యూటీ సీఎంకు స్వాగతం పలుకుతున్న జేసీ

రేణిగుంట: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు మంగళవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. శ్రీహరికోట షార్ పర్యటన నిమిత్తం మంగళవారం ఉదయం 10.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్డీఓలు నిషాంత్ రెడ్డి, రవి శంకర్ రెడ్డి, ప్రోటోకాల్ ఎస్‌డీసీ చంద్రశేఖర్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన షార్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమానంతరం సాయంత్రం 5.20గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుంచి విజయవాడకు వెళ్లారు. ఆయనకు విమానాశ్రయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు వీడ్కోలు పలికారు.

మధ్యాహ్నభోజన నాణ్యత పెంచండి

శ్రీకాళహస్తి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలని ఎస్ఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు చుట్టు గురవయ్య కోరారు. మంగళవారం ఆయన పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని మండిపడ్డారు. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారీలు తెచ్చుకుని భోజనం తినాల్సి వస్తోందన్నారు. మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్న ఏజెన్సీలు, కాంట్రాక్టర్లతో కొందరు ప్రధానోపాధ్యాయులు కుమ్మక్కు కావడంతో భోజనం నాణ్యత తగ్గుతోందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి స్పందించి మధ్యాహ్న భోజన పథకంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, శశి, సాయి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పేదరిక నిర్మూలన

ఏర్పేడు: విద్యతో పేదరిక నిర్మూలన జరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ అన్నారు. మంగళవారం మండలంలోని పల్లం హైస్కూల్‌లో స్కూల్ మేళా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్చాలని సూచించారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి తమ వంతుగా స్కూల్ మేళా స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. మరింత మంది దాతలు ముందుకువచ్చి విద్యార్థుల అభ్యున్నతికి దోహదపడాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ మేళా స్వచ్ఛంద సంస్థ కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ పంచాయతీ విధి



శిక్షణలో పాల్గొన్న సర్పంచ్‌లు, కార్యదర్శులు

సత్యవేడు: ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ పంచాయతీల ప్రధాన విధుల్లో ఒకటని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ సమర్థంగా చేయగలిగితే చెత్త నుంచి సంపద సృష్టించవచ్చన్నారు. అనంతరం క్లాప్ మిత్రలతో కలసి సిబ్బంది చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మునిరవికుమార్, మాస్టర్ ట్రైనర్లు శైలేంద్ర, గోవిందస్వామి పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం సద్వినియోగం చేసుకోండి

నారాయణవనం: మండలంలోని పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనకు పుత్తూరు నుంచి పునఃప్రారంభమైన ఆర్టీసీ బస్సు సర్వీసును మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం సాయంత్రం సత్యవేడు, నగరి ఎమ్మెల్యేలు ఆదిమూలం, భానుప్రకాష్ పుత్తూరులో కైలాసనాథకోనకు రెండు ట్రిప్పుల ఆర్టీసీ బస్సు సర్వీసును పునఃప్రారంభించారు. గతంలో పుత్తూరు నుంచి కైలాసనాథకోనకు నడుస్తున్న ఆర్టీసీ బస్సు సర్వీసు రద్దు అయ్యింది. పలువురి వినతుల మేరకు తిరిగి బస్సు సర్వీసును పునఃప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

నారాయణవనం: టీటీడీ అనుబంధ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ఉత్సవర్లకు వ్యాఘ్రవాహన సేవ నిర్వహించారు. ఉదయం భద్రకాళి సమేత వీరభద్రస్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాలను టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ తదితరులు పర్యవేక్షించారు.

గంగమ్మ తల్లీ చల్లగా చూడమ్మా!



క్యూలో వేచి ఉన్న భక్తులు



గంగమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ సిపాయి

- పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్న భక్తులు
- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

రేణిగుంట: పట్టణంలో మంగళవారం జరిగిన గంగమ్మ జాతరకు భక్తకోటి పోటెత్తారు. కోర్కెలు తీర్చే గంగమ్మ తల్లి ఉత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, వేపాకులు చుట్టిన పాత్రల్లో నైవేద్య వస్తువులు తెచ్చి పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, తమను చల్లగా చూడుతల్లీ అని మనసారా వేడుకున్నారు. జిల్లాలోనే ఎంతో వేడుకగా జరిగే రేణిగుంట గంగమ్మ జాతర సందర్భంగా గంగమ్మ ఆలయానికి మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు ఘనంగా చేపట్టారు. అమ్మవారి అభిషేక పూజల అనంతరం విశేషంగా అలంకరించారు. భక్తులు క్యూలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. రేణిగుంటవాసులే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో ఎలాంటి తోపులాటలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రేణిగుంట డీఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో సీఐ శరత్‌చంద్ర, ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం ముందు త్రిశూలం వద్ద మహిళలు నైవేద్యం సమర్పించారు. అలాగే నడివీధి గంగమ్మ వద్ద భక్తులకు రాగి అంబళ్లు పోశారు. పట్టణ పురవీధుల్లో, నడివీధి గంగమ్మ వద్ద, ఓవర్‌బ్రిడ్జ్ మీద ఏర్పాటు చేసిన దేవతామూర్తుల విద్యుత్ కాంతులు ఉత్సవ శోభను ద్విగుణీకృతం చేశాయి. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అర్ధరాత్రి పసుపుతో రూపొందించిన అమ్మవారి విగ్రహ ప్రతిమ ఊరేగింపు అనంతరం నడివీధిలో ప్రతిష్ఠిస్తారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ

జాతర సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం గంగమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పెద్దలు సాదర స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జున్‌రెడ్డి శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అమ్మవారికి సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతినారాయణ, సదాశివరెడ్డి, వీఆర్ రావణన్, వెంకటేశ్వరచౌదరి, మహబూబ్ బాషా, మునీర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పేరంటాల ఉత్సవం

నారాయణవనం: ఏడు గంగమ్మల జాతర సందర్భంగా మండల కేంద్రమైన నారాయణవనంలో మంగళవారం అమ్మవారి గరిగెతో పేరంటాల ఉత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. బుధవారం నారాయణవనంతోపాటు సముదాయం, వీకేపాళ్యం, నాగిలేరు, ఎగువ, దిగువ బొప్పరాజుపాళెంలో గంగ జాతరను నిర్వహిస్తున్నారు. నారాయణవనంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో జరిగే జాతర సందర్భంగా మంగళవారం ఉదయం తేరు వీధిలోని రాములవారి భజన మందిరం నుంచి యువకుడు పట్టుచీరను ధరించి, పూల జడతో అమ్మవారి వేషధారణలో తలపై గరిగెతో వీధుల ఊరేగింపుగా బయలుదేరారు. సాయంత్రానికి భావనారుషి ఆలయ సమీపంలోని రజక కాలనీకి గరిగె చేరుకుంది. అనంతరం వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించిన సర్వభూపాల వాహనంలో గంగమ్మ కొలువు తీరారు. బలి, సర్కారు హారతులను అందుకున్న గంగమ్మ వీధుల ఊరేగింపునకు బయలుదేరారు. బుధవారం రాత్రి ఏడు గంగమ్మల నిమజ్జం నిర్వహించనున్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి

శ్రీకాళహస్తి: స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సూచనల మేరకు పట్టణంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పురపాలకసంఘ కమిషనర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో కూడా హర్ ఘర్ తిరంగా ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.శ్రీలత, అధ్యాపకులు బాపనయ్య, వర్మ, రుద్రమదేవి, రోహిణి, సుహాసిని, సాయి వెంకటేశం, రమేష్, సంక్రాంతి రాజేంద్రుడు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రండి!



శ్రీకాళహస్తి: పాపానాయుడుపేటలోని ద్రౌపదీ సమేత ధర్మారాజులస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులకు నిర్వాహకులు మంగళవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. రోశయ్య, అర్జున్‌బాబు, తంబ సుబ్రహ్మణ్యం, గణేష్ మొదలియార్, పెద్ద సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఏడు నెలలుగా సీఐ పోస్టు ఖాళీ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలు గాడి తప్పుతున్నాయి. ఎన్నికల బదిలీల్లో భాగంగా గత ఫిబ్రవరిలో బుచ్చినాయుడుకండ్రిగ సర్కిల్ సీఐగా పనిచేస్తున్న శ్రీహరి వీఆర్‌కు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి శ్రీకాళహస్తి రూరల్ సీఐ రారాజు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. రెగ్యులర్ సీఐ లేకపోవడంతో గ్రేవ్ కేసులు మర్డర్, ప్రమాదాల కేసుల విచారణలు అలస్యం అవుతున్నాయి. ఎన్నికలు సైతం ఇన్‌చార్జి సీఐ పాలనలో జరగడం విశేషం. ఇప్పటికైన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పోస్టును భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మద్యం మత్తులో వాహనం నడిపితే శిక్ష

సత్యవేడు: మద్యం మత్తులో వాహనాలు నడిపితే శిక్ష తప్పదని సీఐ మురళి అన్నారు. సత్యవేడు సర్కిల్ కార్యాలయానికి నూతనంగా వచ్చిన సీఐ మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్యం తాగి వాహాలు నడపడం నేరమని, ప్రమాదకరమైనప్పటికీ కొందరు వాహన చోదకులు దీన్ని ఏమాత్రం ఖాతరు చేయడం లేదన్నారు. ఫలితంగా నిత్యం రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మద్యం, గంజాయి మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సత్యవేడులో నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటామన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకొంటామన్నారు.